సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం, 29, అక్టోబర్, 2024



65.4 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయంలో సోమవారానికి 65.4 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 19,630 క్యూసెక్కుల వరద వస్తోంది. కండలేరుకు 10 వేలు, దిగువకు 355 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.80,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,315
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,534
నవర (8 గ్రాములు)	రూ.60,272

గరిష్టం/కనిష్టం
35.7 /26.6

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. సోమవారం గాలిలో తేమ 67 శాతం ఉంది.

న్యూస్‌రీల్

బోర్డు పరిమితి మేరకే పొగాకు ఉత్పత్తి

- ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు

మర్రిపాడు: ప్రపంచ వ్యాప్తంగా పొగాకు సాగు పెరుగుతుందని, బోర్డు ఇచ్చిన పరిమితి మేరకే పొగాకును పండించాలని, అధిక ధరలకు బ్యారెన్లు లీజుకు తీసుకోవద్దని పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలో పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కోరారు. సోమవారం పొగాకు బోర్డు రీజనల్ కార్యాలయ యాజీఓ తులసి, కేవీకే కందుకూరు శాస్త్రవేత్తలు ప్రసాద్ బాబు, వెంకటేశ్వర్లు, మర్రిపాడు ఏఓ రామ్మోహన్‌తో కలిసి రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పెసర, మినుము, శనగ, కందిలో కొత్త వంగడాలు ఉన్నాయని, అవి పలు రకాల వైరస్, వ్యాధులను తట్టుకునే విధంగా ఉన్నాయని, అధిక గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయని తెలిపారు. ఏఓ రామ్మోహన్ మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా జొన్నలో ఎన్‌టీజే-5 రకం మంచి మద్దతు ధర లభిస్తుందని, నువ్వులు, శనగలు సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, పొగాకు రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా ఉదయ్‌భాస్కర్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్వో

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లా రెవెన్యూ అధికారిగా ఉదయ్‌భాస్కర్ సోమవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు చేపట్టారు. పశ్చిమగోదావరి డీఆర్‌ఓగా ఉన్న ఉదయ్‌భాస్కర్ బదిలీపై నెల్లూరుకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ ఆనంద్‌ను, జేసీ కార్తీక్‌ను చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏఓ విజయ్‌కుమార్‌తో పాటు కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది డీఆర్‌ఓను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ధర్నాలు చేస్తుంటే మీరేం చేస్తున్నారు?

- టీడీపీ నేతలపై మంత్రి ఫైర్

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులో పలుచోట్ల మద్యం దుకాణాలొద్దంటూ కొంత మంది ధర్నాలు చేస్తుంటే స్థానిక టీడీపీ నేతలుగా మీరేం చేస్తున్నారంటూ మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకులతో సోమ వారం సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మహిళలు ధర్నా చేస్తుంటే వారిని నిలువరించకుండా ఉన్నారా.. అంటూ పరుషంగా కొంత మంది నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇక నుంచి ఇటు వంటి ధర్నాలు, నిరసనలు లేకుండా చూసే బాధ్యత స్థానిక నాయకులదే అని హెచ్చరించినట్లు సమాచారం. మంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే.. జనావాసాల్లో మద్యం దుకాణాలపై ఆందోళన చేస్తున్న ప్రజలు, మహిళలపై దాడులకు ఉసిగొల్పుతున్నట్లు ఉన్నాయని టీడీపీ నేతలు అవాక్కయ్యారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు

- 8న పాఠశాలల కేటాయింపు

నెల్లూరు (టౌన్): జిల్లాలో మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియను చేపట్టనున్నారు. ఎస్జీటీలను స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించనున్నారు. వచ్చే నెల 1వ తేదీ వరకు గ్రేడ్-2 హెడ్‌మాస్టర్లు పోస్టుల కోసం సీనియార్టీ లిస్ట్‌ను తయారు చేసి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 4న ఫైనల్ జాబితాను ప్రకటించనున్నారు. 6న లిస్ట్‌లో ఉన్న సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించి గ్రేడ్-2 హెడ్‌మాస్టర్లుగా పోస్టులు కేటాయించనున్నారు. వచ్చే నెల 1వ తేదీ వరకు సెకండరీ గ్రేడ్ టీచర్లు సీనియార్టీ జాబితాను తయారు చేసి వారి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 4న ఫైనల్ జాబితాను తయారు చేసి 8న కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్ ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించి పోస్టింగ్‌లు కేటాయించనున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో 16 హైస్కూల్స్, కావలి మున్సిపాల్టీలో 3 హైస్కూల్స్, గూడూరు మున్సిపాల్టీలో 2 హైస్కూల్స్ ఉన్నాయి. ఈ పాఠశాలల పరిధిలో 600 మంది ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లోని ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్-2 హెడ్‌మాస్టర్, కావలి మున్సిపాల్టీలోని హైస్కూల్‌లో గ్రేడ్-2 హెడ్‌మాస్టర్ ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు లెక్కలు తేల్చారు.

పారేదెలా.. సాగేలా

ప్రాజెక్ట్‌లు, జలవనరుల్లో సాగునీరు చేరుతున్నా.. పంట భూములకు చేరడం గగనం కానుంది. జిల్లా వ్యాప్తంగా మేజర్ నుంచి మైనర్ ఇరిగేషన్ కాలువల వరకు గుర్రపు డెక్క, తుంగ, పిచ్చి మొక్కలతో పూడిపోయాయి. కాలువలు ఇలా ఉంటే.. సాగు జరిగేదెలా అని రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఏడాది రబీ సీజన్ మొదలైనా.. ఇంత వరకు కాలువల్లో పూడిక తీత పనులను చేపట్టలేదు. కేవలం ప్రతిపాదనలతో సరిపెట్టారు. గత ప్రభుత్వంలో వరుసగా సకాలంలో వర్షాలు కురవడంతో ఎక్కడా నీరు నిలబడకుండా పారుదల సవ్యంగా సాగేలా కాలువల్లో పూడికి తీసిన పరిస్థితి ఉండేది.

పూడిపోయిన పంట కాలువలు

- రబీ సీజన్ ప్రారంభమైనా మొదలుకాని పనులు
- గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు పూడికతీత
- మరమ్మతులకు ప్రతిపాదనలతో సరి
- ఆందోళనలో అన్నదాతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రైతులంటే కూటమి ప్రభుత్వానికి ఎంత అలుసో.. జిల్లాలో సాగునీటి పారుదల కాలువల పరిస్థితే అద్దం పడుతోంది. పంట కాలువల్లో ఏటా గడ్డి, గుర్రపు డెక్క, నాచు, తుంగ, పిచ్చి మొక్కలతో పూడిపోవడం సహజం. అయితే ఏటా రబీ సీజన్ నాటికి కాలువల్లో పూడిక తీత పనులు క్రమం తప్పకుండా చేయాల్సి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సాగునీటి వనరులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండేది. అయితే కూటమి ప్రభుత్వం రైతులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఖరీఫ్ సీజన్ నుంచి పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిన ఈ ప్రభుత్వం కాలువల్లో పూడిక తీత, మరమ్మతుల పనులకు నయాపైసా విడుదల చేయకుండా ప్రతిపాదనల పేరుతో మీనమేషాలు లెక్కపెడుతోంది. రబీ సీజన్ ప్రారంభమైనా ఇంత వరకు ఐఏబీ సమావేశం నిర్వహించకుండా నీటి విడుదలపై జాప్యం చేస్తోంది. జిల్లాలో ప్రధాన జలవనరుల నుంచి సాగునీటిని చెరువులకు తరలించే కాలువలు పూడిపోయాయి. పూడిక తీతకు చర్యలు చేపట్టకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది.



గడ్డితో పూడిపోయిన పంట కాలువ



గుర్రపుడెక్కతో నిండిన సంగం మండలం దువ్వూరు ప్రధాన కాలువ

పూడిపోయిన కాలువలు..

ఆత్మకూరు నియోజకవర్గంలో ఆరు మండలాల పరిధిలో సాగునీటి కాలువలు చెత్తా చెదారం, పిచ్చి మొక్కలతో నీరు అడుగు కూడా ముందుకు సాగని దుస్థితి. ఆత్మకూరులోని అన్న కాలువ, పెద్దిరెడ్డి కాలువ, పంట కాలువలు పూడికతో నిండిపోయాయి. బట్టేపాడు కాలువ, నువ్వూరుపాడు తూము కాలువలు దుస్థితిలో ఉన్నాయి. సంగం మండలంలోని దువ్వూరు కాలువ గుర్రపు డెక్కతో నిండిపోయింది. ఏఎస్‌పేట, చేజర్ల మండలాల్లో కాలువల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమి లేదు.

నాలుగు వేల ఎకరాలకు పారుదల కష్టం

కోవూరు నియోజకవర్గంలోని ఎక్కువ గ్రామాలకు సాగు నీరు అందించే సదరన్ చానల్ దాదాపు పూడిపోయింది. పంట కాలువలు గుర్రపు డెక్కతో నిండిపోయివుంది. పడుగుపాడు సదరన్ చానల్ నుంచి పది గ్రామాలకు సాగునీరు వెళ్తుంది. ఇటీవల పడుగుపాడు జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా ఒక బ్రిడ్జిని ఏర్పాటు చేసి మధ్యలోనే వదిలేశారు. ఈ కాలువ ద్వారా దాదాపు నాలుగు వేల ఎకరాలు సాగు జరుగుతుంది. అధికారులు పంట కాలువల పూడిక తొలగించకుంటే.. నార్లు పోసే పరిస్థితి కూడా ఉండదు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంట కాలువలు గుర్రపుడెక్క, నాచుతో నీటిపారుదలకు అవరోధంగా మారాయి.

కావలి కాలువలో పూడిక తీత ఎప్పుడో

సంగం బ్యారేజీ నుంచి సుమారు 65 కి.మీ పొడవు ఉన్న కావలి కాలువ ప్రస్తుతం పిచ్చిమొక్కలు, పూడికతీతతో నిండిపోయింది. బ్యారేజీ నుంచి భారీ స్థాయిలో నీరు వదిలినా చెరువులకు చేరడం కష్టంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో కావలి కాలువ కొంత మేర పూడికతీత తీశారు. మిగతా చోట్ల పనులు జరగలేదు. భారీ వర్షాలు వచ్చినా పనులు చేసే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కావలి కాలువ కింద 1.25 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 52 చెరువులతో పాటు 18 మేజర్, మైనర్ కాలువలున్నాయి. బ్రాహ్మణక్రాక, కొత్తపాళెం, హనుమకొండపాళెం మేజర్ కాలువ గేట్లు తుప్పు పట్టి నీరంతా వృథాగా పోతోంది.

గండిపాళెం పరిస్థితి ఇంతే

మెట్టప్రాంత వరప్రసాదిని గండిపాళెం రిజర్వాయర్ పరిధిలో 16 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎడమ, కుడికాలువలు పూడిక, ముళ్లపొదలతో నిండిపోయాయి. 5వ నంబర్ కాలువ అధ్వానంగా ఉంది. ప్రధాన కాలువల నుంచి డిస్ట్రిబ్యూటరీకాలువలకు నీరు వదిలే గేట్లు తుప్పు పట్టి మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ప్రధాన కాలువలకు నీరు వదిలితే నీరంతా వృథాగా పోతోంది.

20 వేల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం

సర్వేపల్లి నియోజకవర్గంలో వెంకటాచలం, ముత్తుకూరు మండలాల్లో సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరందించే సర్వేపల్లి రిజర్వాయర్ తూముల వద్ద ఆకు పేరుకుపోవడంతో నీరు ముందుకు సాగడం ఇబ్బందికరంగా మారింది. రిజర్వాయర్ నుంచి పంట పొలాలకు సాగునీరు విడుదల చేసేందుకు ఉన్న 12 కాలువల్లో జమ్ము, పిచ్చి మొక్కలతో పూడిక విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం తూముల ద్వారా నీటిని విడుదల చేసినా కాలువల్లో పూడిక ఉండడం వల్ల చివరి ఆయకట్టు నీరు వెళ్లే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొదలకూరు, వెంకటాచలం మండలాల్లో పలు గ్రామాలకు సాగునీటి విడుదలకు ప్రధానమైన కనుపూరు కాలువలోనూ పలు చోట్ల విపరీతంగా పూడిక పెరిగి సాగునీరు ముందుకు సాగడంలేదు. మనుబోలు మండలంలోని రైతాంగానికి సాగునీరు విడుదల చేసే బండేపల్లి బ్రాంచ్ కెనాల్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఇరిగేషన్ సాగు పరిస్థితి

మేజర్ ట్యాంక్స్	- 68
ఆయకట్టు	- 1,02,100
మీడియం ట్యాంక్స్	- 104
ఆయకట్టు	- 28,934
మైనర్ ట్యాంక్స్	- 1,746
ఆయకట్టు	- 2,91,451

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కాలువల పూడిక తీతకు ప్రతిపాదించిన అంచనాలు

నియోజకవర్గం	పనులు	రూ.లక్షల్లో
ఆత్మకూరు	77	596.13
కోవూరు	106	586.33
నెల్లూరు రూరల్	80	624.03
సర్వేపల్లి	126	814.04
కావలి	113	788.55
ఉదయగిరి	72	393.80
గూడూరు	40	295.06
సూళ్లూరుపేట	50	266.20
వెంకటగిరి	32	600.00
మొత్తం	696	4,964.14



పూడిక తీయకపోవడంతో సంగం మండలం మక్తాపురం కాలువ దుస్థితి

టపాసుల దుకాణాల కేటాయింపు రసాభాస

- అనుమతుల్లోనూ అక్రమాలు జరిగాయని లైసెన్స్‌దారులు ఆగ్రహం
- లాటరీ పద్ధతిలో 123 దుకాణాలు



ఆర్డీఓ కార్యాలయం వద్ద లైసెన్స్‌దారుల గందరగోళం

నెల్లూరు సిటీ: నెల్లూరు నగరంలోని టపాసుల దుకాణాల కేటాయింపు ప్రక్రియ రసాభాసగా మారింది. అధికారుల తీరుపై లైసెన్స్‌దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాంతాల కేటాయింపులో జాప్యం చేశారని, ఓ ఉద్యోగి అవకతవకలకు పాల్పడ్డారని ఆందోళన చేశారు. ఈ క్రమంలో ఆర్డీఓ అనూష కార్యాలయం బయటకు వచ్చి ఆందోళన చేస్తున్న వారికి సర్ది చెప్పారు. లాటరీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుపుతున్నామని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. నెల్లూరు నగరంలోని ఆర్‌ఎస్‌ఆర్ గ్రౌండ్స్‌లో 28, వీఆర్సీ గ్రౌండ్స్‌లో 46, వైఎంసీ గ్రౌండ్స్‌లో 19, ఎస్వీజీఎస్ కళాశాల గ్రౌండ్స్‌లో 20, సర్వోదయ గ్రౌండ్స్‌లో 10 మొత్తం 123 దుకాణాలకు సంబంధించి సోమవారం సాయంత్రం లాటరీ విధానంలో లైసెన్స్‌దారులకు దుకాణాలు కేటాయించారు.ఆయా దుకాణాలకు ఆర్డీఓ అనూష ఆధ్వర్యంలో లాటరీ విధానంలో కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. దుకాణ నంబర్లను వరుస క్రమంలో లైసెన్స్‌దారులైన ఒక్కొక్కరితో లాటరీ తీయించారు.

ఓ ఉద్యోగిపై ఆరోపణలు

లాటరీ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఓ ఉద్యోగి తీరుపై లైసెన్స్‌దారులు ఆరోపణలు చేశారు. గతంలో వారం రోజుల ముందు ఏ లైసెన్స్‌దారుడికి ఏ ప్రాంతంలో దుకాణం కేటాయిస్తారనేది తెలిపేవారు. దీంతో టపాసులు విక్రయాలకు సంబంధించి ఏ స్థాయిలో దిగుమతి చేసుకోవాలో నిర్ణయం తీసుకునేవారు. అయితే ఈ దఫా ఓ ఉద్యోగి అవకతవకలకు పాల్పడ్డారని, కొందరికి మాత్రమే న్యాయం జరిగేలా చేశారని ఆర్డీఓ అనూషకు ఫిర్యాదు చేశారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మంత్రి ఆనం

సోమశిల: క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సోమవారం అనంతసాగరంలో ప్రత్యేక ప్రజావిజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంత్రి ఆనం ప్రారంభించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి, అధికారుల సమక్షంలో చర్చించి పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక ప్రజావిజ్ఞాపనల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధి పనులకు ప్రత్యేక ప్రణాళిక

సోమశిల జలాశయ అభివృద్ధి పనులు, సోమేశ్వరాలయ పునర్నిర్మాణం, నడికుడి శ్రీకాళహస్తి రైల్వేలైను, జాతీయ రహదారుల ఏర్పాటుతో ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు మంత్రి ఆనం చెప్పారు. మండలానికి రూ.1.50 కోట్ల ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయని మంత్రి చెప్పారు.

సోమేశ్వరాలయానికి రూ.8.40 కోట్లు మంజూరు

సోమశిలలోని సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి దేవదాయశాఖ తరఫున రూ.8.40 కోట్లు మంజూరు చేశామని మంత్రి చెప్పారు. ఆలయ నిర్మాణానికి ఇంకా అవసరమైన నిధులను కూడా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి చెప్పారు.



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి ఆనం

1,425 అర్జీలు : జేసీ కార్తీక్

అనంతసాగరం ప్రత్యేక ప్రజావిజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలు సమస్యలపై 1,425 అర్జీలు అందినట్లు జేసీ కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ పావని, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, తహసీల్దారు సుధీర్, జిల్లా, మండల స్థాయి అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన అలల కరెంట్

సముద్ర అలలతో విద్యుత్ ఉత్పత్తికి గత ప్రభుత్వంలో నెడ్‌క్యాప్ సన్నాహాలు

- రాష్ట్రంలో 12 ప్రాంతాలు, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కావలి, కోట, పులికాట్ తీర ప్రాంతాలు అనుకూలంగా గుర్తింపు
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ సహకారంతో కసరత్తు
- తాజాగా ఆ ప్రతిపాదనలు పక్కన పడేసిన వైనం

ప్రపంచ వ్యాప్తంగా తగ్గిపోతున్న బొగ్గు నిల్వలతో సమీప భవిష్యత్‌లో విద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ పరిస్థితిని పసిగట్టిన శాస్త్రవేత్తలు దశాబ్దాల క్రితమే ప్రత్యామ్నాయ మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించారు. అందులో భాగంగా సంప్రదాయేతర పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అభివృద్ధి సంస్థ సోలార్, విండ్ పవర్ ద్వారా విద్యుత్ కొరతను అధిగమించేందుకు ప్రయత్నిస్తోంది. గత ప్రభుత్వం కర్నూలు జిల్లాలో వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అల్ట్రా మెగా సోలార్ పార్క్‌ను నిర్మించింది. ఇలాంటి పార్క్‌లు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించడానికి సన్నాహాలు చేసింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని సువిశాల సముద్రం వెంబడి సముద్ర అలలతో కరెంట్ ఉత్పత్తిని పెంచాలనే యోచనతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ సహకారంతో కసరత్తు ప్రారంభించింది. జిల్లాలో మూడు ప్రాంతాలు అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. అయితే కూటమి ప్రభుత్వ ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పడేసినట్లు తెలుస్తోంది.

కావలి: రాష్ట్రంలోనే అత్యధిక సముద్ర తీరం కలిగిన జిల్లాలో సముద్ర కెరటాల ద్వారా కరెంట్ ఉత్పత్తి చేసేందుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన కసరత్తు మూలన పడింది. సంప్రదాయేతర పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అభివృద్ధి సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ సహకారంతో క్షేత్రస్థాయిలో అన్వేషణ ప్రారంభించింది. అందుబాటులో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ వనరులను సమకూర్చునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2021లోనే సన్నాహాలు చేసింది. అయితే రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో దాదాపు 6 వేల ఎకరాల్లో సోలార్, విండ్ ద్వారా వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించిన నేపథ్యంలో కెరటాల ద్వారా కరెంట్ ప్రాజెక్ట్‌ను పరిశీలనలో పెట్టింది. అందులో భాగంగా రాష్ట్రంలో 12 ప్రాంతాలు ఇందుకు అనుకూలంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించగా, అందులో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కావలి, కోట, పులికాట్ తీర ప్రాంతాలు అనుకూలంగా ఉంటుందని నిర్ధారించింది

ఇజ్రాయెల్, కేరళల్లో ప్రాజెక్ట్‌లపై స్టడీ

సముద్ర అలలతో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్ట్‌లు ఇజ్రాయెల్ దేశంలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇక దేశీయంగా చూస్తే కేరళ రాష్ట్రంలో 'విళింజం' సముద్ర తీర ప్రాంతంలో 'అల'లతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్రక్రియపై 1991 నుంచి శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయోగాలు పూర్తయి విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రాజెక్ట్‌ను స్టడీ చేసి రాష్ట్రంలోని సువిశాల తీరంలో ఆ తరహా ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయాలని గతంలో ప్రభుత్వం ప్రయత్నించింది.



అలల తాకిడి అత్యధికంగా ఇక్కడే

రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి తడ వరకు 975 కి.మీ. సముద్ర తీరంలో 12 ప్రాంతాలు కరెంట్ ఉత్పత్తికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. తీరంలో 25 మీటర్ల లోతు ఉంటే అలల తీవ్రత అధికంగా ఉంటుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ ప్రాథమిక అంచనా. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కావలి, కోట, పులికాట్ తీరంలో అలల తాకిడి తీవ్రంగా ఉంటున్నట్లు నిర్ధారించారు. కావలి మండలంలో చెన్నాయపాళెం పెద్దపట్టపుపాళెం వద్ద అలలతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరిగాయి. అయితే ఇక్కడికి కేవలం కూతవేట దూరంలోనే రామాయపట్నంలో ఓడ రేవు నిర్మాణం జరుగుతుండడంతో విద్యుత్ ఉత్పత్తి మంచి ఫలితాలు సాధిస్తుందని భావించారు.




రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వ్యయం

అలలతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలంటే ఒక్క మెగావాట్ సామర్థ్యానికి రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇక్కడి అలల సామర్థ్యం, ఉత్పత్తి అంచనాను బట్టి పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. సముద్రం ఒడ్డు నుంచి కనీసం 10 మీటర్లతో ప్రారంభమై 50 మీటర్ల లోపలికి నీటిలో నిర్మాణాలు చేయడం ద్వారా తీరంలో శాశ్వతంగా ఉండే 'అల'లతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే కేంద్రాన్ని నిర్మిస్తారు. పర్యావరణానికి అనుకూలమైన ఈ తరహా విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు వల్ల తీరం కోతకు గురికాకుండా సురక్షితంగా ఉంటుందని శాస్త్రవేత్తలు నిగ్గు తేల్చారు. ఈ పరిణామాలు తీర ప్రాంతం భద్రతకు కూడా దోహదపడనుంది. కేంద్ర ప్రభుత్వం భూమి శాస్త్రం (ఎర్త్ సైన్స్) మంత్రిత్వశాఖ పరిధిలో ఉన్న జాతీయ సముద్ర సాంకేతిక సంస్థ, చెన్నై ఐఐటీ నిపుణులు, అమెరికా శాస్త్రవేత్తలు చేసిన సమగ్రమైన పరిశోధనలను పరిగణలోకి తీసుకుంటే మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

సోలార్ విద్యుత్ ఉత్పత్తికి కేంద్రం రాయితీలు

దేశీయంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా బొగ్గు నిల్వలు అడుగంటిపోతున్నాయి. బొగ్గుతో విద్యుత్ ఉత్పాదక వ్యయం కూడా భారీగా ఉంటుంది. తద్వారా కాలుష్యం కూడా పెరుగుతున్న క్రమంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తిపై కేంద్ర ప్రభుత్వం కూడా దృష్టి సారించింది. అందులో భాగంగా ప్రతి కుటుంబాన్ని ఇందులో భాగస్వామ్యం చేస్తూ 'పీఎం సూర్య గర్' పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందు కోసం రాయితీలు ప్రకటిస్తోంది. కాలుష్య రహితంగా సముద్ర కెరటాలతో విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నప్పటికీ అందుపుచ్చుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోంది. అందులో భాగంగా రాష్ట్ర సంప్రదాయేతర, పునరుత్పాదక విద్యుత్ కార్పొరేషన్ అధికారులు గత ప్రభుత్వంలో చేసిన కృషి నేటి ప్రభుత్వంలో నీరుగార్చేలా ఈ ప్రాజెక్ట్‌ను పక్క పెట్టేసింది.



ప్రతి ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటాం

• ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైమ్): ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య తెలిపారు. నెల్లూరులోని పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించిన ఏఎస్పీ ఆయా ప్రాంత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ గిరిధర్‌రావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ సౌజన్య

ఫిర్యాదుల్లో కొన్ని..

• అదనపుకట్నం కోసం భర్త ఇంట్లో నుంచి గెంటేశాడు. ఇటీవల రెండో వివాహం చేసుకున్నాడు. అతడికి సహకరిస్తున్న అత్తమామలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలిగిరికి చెందిన ఓ వివాహిత ఫిర్యాదు చేశారు.

• ఆస్తి కోసం కొడుకు సతీష్, కోడలు వేధిస్తున్నారని, ఇళ్లను వారి పేరుపై రాయమని బెదిరిస్తున్నారని ఇందుకూరుపేటకు చెందిన ఓ వృద్ధురాలు ఫిర్యాదు చేశారు.

• బుచ్చి ఏఎస్ఆర్ కాంప్లెక్స్‌లో షాప్ పెట్టుకుని జీవిస్తుండగా పక్క షాపునకు చెందిన శ్రీనివాసులు, అతని కుటుంబసభ్యులు దాడులు చేస్తున్నారని విచారించి న్యాయం చేయాలని ఓ మహిళ విన్నవించారు.

• ఇంట్లో దొంగలు పడి సర్వం దోచుకెళ్లారు. విచారించి చోరీ సొత్తును రికవరీ చేయాలని నెల్లూరు రూరల్ మండలం కాకుపల్లికి చెందిన మస్తానయ్య అర్జీ ఇచ్చారు.

లారీ డ్రైవర్ మద్యం మత్తుకు ఒకరి బలి

వలేటివారిపాలెం: మద్యం మత్తులో ఓ డ్రైవర్ లారీని నడిపి మోటార్ బైక్‌ని ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని కాకర్లపాళెం బస్టాప్ సమీపంలో 167బీ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన బి.పృథ్వీరాజ్ (32) తన భార్య, పిల్లలు, తల్లి వలేటివారిపాళెంలో ఉండడంతో వారిని తీసుకొచ్చేందుకు బైక్‌పై వలేటివారిపాళెం వచ్చాడు. ఈలోపే పామూరు బస్ రావడంతో వారు ఎక్కేశారు. దీంతో అతను అయ్యవారిపల్లికి బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. కాకర్లపాళెం బస్ స్టాప్ సమీపంలోకి రాగానే పామూరు నుంచి కందుకూరు వైపు తెల్లరాయి పొడితో వెళ్తున్న లారీ రాంగ్ రూట్‌కు వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో పృథ్వీరాజ్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వలేటివారిపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్, క్లీనర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం తర్వాత వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.




పృథ్వీరాజ్ (ఫైల్)

• పృథ్వీరాజ్‌కు ఇద్దరు ఆడపిల్లలు. వారు కొన్నిరోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో ఆదివారం ఒంగోలులో ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత సోమవారం ఇంటికి బయలుదేరారు. కందుకూరు నుంచి ఇసుకపాళెం బస్సు ఎక్కి వలేటివారిపాళెంలో దిగారు. అక్కడి నుంచి వాహనాలు లేకపోవడంతో పృథ్వీరాజ్‌కు ఫోన్ చేశారు. అతను వచ్చే లోపు పామూరు బస్సు రావడంతో ఎక్కారు. పృథ్వీరాజ్ మృతి విషయాన్ని తెలుసుకున్న భార్య ప్రత్యూష, తల్లి ధనమ్మ, ఇద్దరు కుమార్తెలు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్.. చాలా డేంజర్

సకాలంలో స్పందిస్తే సేఫ్

• గ్రామీణం కన్నా పట్టణ ప్రాంతాల్లో అధికం
• మద్యం, ధూమపానం, ఒత్తిడి వల్లే ఎక్కువ కేసులు
• జిల్లాలో 20 ఏళ్లలో వంద శాతం పెరిగిన రోగులు
• ప్రపంచ స్ట్రోక్ డే నేడు



నెల్లూరు(అర్బన్): జీవనశైలిలో మార్పుల కారణంగా అనేకమంది రోగాల బారిన పడుతున్నారు. వాటిలో బ్రెయిన్ స్ట్రోక్ ఒకటి. ఒకప్పుడు 60 సంవత్సరాల వయసు దాటిన వారిలో వచ్చే పక్షవాతం నేడు యువతలోనూ కనిపిస్తోంది. జిల్లాలో ప్రతి సంవత్సరం లక్ష మంది జనాభాలో గ్రామీణ ప్రాంతంలో 256 మంది, పట్టణ ప్రాంతాల్లో 424 మంది బ్రెయిన్ స్ట్రోక్ గురవుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. గతంలో స్ట్రోక్‌కు గురై చికిత్స పొంది వివిధ దశల్లో (పక్షవాతం, సక్రమంగా మాట్లాడలేకపోవడం, కొంతవరకు కోలుకున్న రోగులు) మరో 40 వేల మంది వరకు రోగులున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అంచనా వేసింది. అంటే కొత్త కేసులతో కలిపితే కనీసం 50 వేల మంది స్ట్రోక్‌తో బాధపడుతున్నారు. ఇరవై ఏళ్లలో కేసులు రెట్టింపయ్యాయి. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రతి ఏటా స్ట్రోక్‌కు గురయ్యేవారి సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. 35 శాతం కేసులు ధూమపానం వల్ల, 26 శాతం మద్యపానం వల్ల, 26 శాతం బీపీ వల్ల, 16 శాతం మంది మధుమేహం (షుగర్) వల్ల, మరో 16 శాతం ఊబకాయం వల్ల నమోదవుతున్నాయి. బాధితుల్లో 65 శాతం మంది పురుషులు, 35 శాతం మంది మహిళలున్నారు.

కారణాలివే..

బీపీ నియంత్రణలో లేకపోవడం, ఊబకాయం, షుగర్ అధికంగా ఉండటం, అధిక కొలెస్ట్రాల్, శారీరక శ్రమ లేకపోవడం, ఒత్తిడితో పని చేయడం, మానసిక ఒత్తిడికి గురవడం, గర్భనిరోధక మాత్రలు వాడటం.

ఇలా గుర్తించవచ్చు

మనిషి బ్యాలెన్స్ తప్పి తూలుతూ నడవడం, చూపు మందగించడం, కొన్ని సెకన్లపాటు కళ్లు బైర్లు కమ్మి ఏమి కనిపించకపోవడం, కాలు లేదా చేయి బలహీనంగా మారడం, మతిమరుపు, మాట తీరులో తేడా, మూతి కొంచెం పక్కకు పోవడం తదితర లక్షణాలు.

గోల్డెన్ అవర్ కీలకం

స్ట్రోక్ వచ్చిన తొలి గంట అత్యంత కీలకం. దీనినే గోల్డెన్ అవర్ అంటారు. ఈ సమయంలో డాక్టర్ వద్దకు తీసుకెళ్తే అందుకు సంబంధించిన ఇంజెక్షన్ ఇచ్చి త్వరగా కోలుకునేలా చేస్తారు. సకాలంలో వైద్యం చేయించుకుంటే 80 శాతం మంది బతుకుతారు. ఆలస్యం చేస్తే అంగవైకల్యంతోపాటు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వరల్డ్ స్ట్రోక్ డేగా అక్టోబర్ 29వ తేదీని ప్రకటించి ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు చేపడుతోంది.

ఒత్తిడికి దూరంగా ఉండాలి



ప్రజలు సాధ్యమైనంత వరకు ఒత్తిడికి దూరంగా ఉండాలి. యోగా, వాకింగ్ లాంటివి తప్పకుండా చేయాలి. మద్యపానం, పొగ తాగడం అలవాట్లు మానుకోవాలి. జంక్‌ఫుడ్స్ తినకూడదు. రాత్రిపూట త్వరగా నిద్రపోవాలి. అధిక బరువును తగ్గించుకోవాలి.

– డాక్టర్ దీక్షాంతి నారాయణ్, న్యూరో ఫిజీషియన్, మెడికవర్ స్పెషాలిటీ ఆస్పత్రి

బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలి



అధిక బీపీ, నియంత్రణలో లేని షుగర్ కూడా స్ట్రోక్‌కు కారణమవుతోంది. వీటిని అదుపులో ఉంచుకోవాలి. టార్గెట్స్ వల్ల ఉద్యోగులు టెన్షన్‌కు గురవుతున్నారు. దీనిని అధిగమించాలి. వ్యాయామం చేయడం అలవర్చుకోవాలి. వాయు కాలుష్యానికి కాస్త దూరంగా ఉండాలి.

– డాక్టర్ బిందుమీనన్, న్యూరాలజీ విభాగాధిపతి, అపోలో స్పెషాలిటీ హాస్పిటల్

వినతులిచ్చి.. పరిష్కారం కోరి..

• కలెక్టరేట్‌కు పెద్దఎత్తున విచ్చేసిన జనం
• వివిధ సమస్యలపై 302 అర్జీల అందజేత

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని వివిధ మండలాల నుంచి జనం పెద్దఎత్తున సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌కు విచ్చేశారు. కలెక్టర్ ఆనంద్ నేతృత్వంలో తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందజేశారు. మొత్తం 302 వినతులు వచ్చాయి. కలెక్టర్‌తోపాటు ఇన్‌చార్జి డీఆర్వో అనూష, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డిలు వినతిపత్రాలు స్వీకరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

• వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నందున తక్షణమే సాగునీరు విడుదల చేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు.

• రాపూరు మండలం పులిగలపాడు గ్రామ సమీపంలో ఉన్న స్టోన్ క్రషర్ ఆధ్వర్యంలో బ్లాస్టింగ్ వల్ల అత్తి బాలకృష్ణ అనే వ్యక్తి ఇల్లు దెబ్బతిందని, అతడికి న్యాయం చేయాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

• 30 సంవత్సరాలుగా పోరాడి తెచ్చుకున్న కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సొంత భవనాన్ని అంగన్‌వాడీల కోసమే ఉపయోగపడేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ప్రతినిధులు కోరారు. భవనాన్ని ప్రస్తుతం కోర్టు వారికి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

• దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6,000కు పెంచాలని, ఇంకా వివిధ సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నేతృత్వంలో వినతిపత్రం సమర్పించారు. చిన్న చిన్న కారణాలు చూపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా తొలగించిన 95 వేల పెన్షన్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

• దగదర్తి మండలం పెదపుతేడు గ్రామ పంచాయతీ పేరును శ్రీరామపురంగా గెజిట్లో మార్పు చేసిన నేపథ్యంలో ఆన్‌లైన్ సేవల్లో కూడా ఆ విధంగా మార్చాలని ఇండ్ల కృష్ణయ్య తదితరులు కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 134
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ చికెన్	: 187

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.35
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10

నా కుమారుడ్ని సౌదీ జైల్లో పెట్టారు

• ఏం జరిగిందో తెలియడం లేదు
• విచారించి వివరాలు తెలియజేయండి
• పోలీసులను కోరిన బాధితుడి తల్లి

నెల్లూరు(క్రైమ్): ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లిన నా కుమారుడ్ని జైలుకు పంపారని తెలిసింది. ఏం జరిగిందని కంపెనీకి, ఏజెంట్లకు ఫోన్ చేసి అడిగినా చెప్పడం లేదు. విచారించి వివరాలు తెలియజేయాలని మస్తానమ్మ అనే మహిళ పోలీసులను కోరారు. వివరాలిలా ఉన్నాయి. ఇమాం ఖాసీం, షాహీదా దంపతులది నెల్లూరులోని భగత్‌సింగ్‌కాలనీ. అతను లారీడ్రైవర్. జీవనోపాధి నిమిత్తం ఆ దంపతులు హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్లా, రజాక్ అనే ఏజెంట్ల ద్వారా 2022 డిసెంబర్‌లో సౌదీ అరేబియాకు వెళ్లారు. అతను టిప్పర్ల కంపెనీలో డ్రైవర్‌గా, షాహీదా వేరే చోట పని చేసేవారు. ఇమాం అప్పుడప్పుడూ తన తల్లి, భార్యకు ఫోన్ చేసి మాట్లాడేవాడు. ఈనెల 15వ తేదీ చివరిసారిగా అతడి నుంచి వారికి ఫోన్‌కాల్ వచ్చింది. ఆ తర్వాత నుంచి ఇమాం ఫోన్ పనిచేయడం లేదు. దీంతో షాహీదా తాను పనిచేస్తున్న యజమాని ద్వారా భర్త కంపెనీ వారిని సంప్రదించగా అక్కడ గొడవ జరగడంతో ఇమాంను జైలుకు పంపారని తెలిసింది. పూర్తి వివరాలు కంపెనీ వారు చెప్పలేదు. దీంతో నెల్లూరులో ఉంటున్న ఖాసీం తల్లిదండ్రులు ఏజెంట్లను సంప్రదించగా కనుక్కుని చెబుతామని ఆ తర్వాత నుంచి ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయడం లేదు. ఇమాంను జైల్లో వేయాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందనే వివరాలు తెలియకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు మస్తానమ్మ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు.

హోంగార్డు ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఓ హోంగార్డు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు మూలాపేట రాజాగారివీధిలో విడవలూరు నాగేంద్ర ప్రసాద్ (45), సుప్రియ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి మునిలావణ్య, కిశోర్‌లు సంతానం. నాగేంద్ర బాలాజీనగర్ పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తుండగా సుప్రియ నర్తకి సెంటర్‌లోని ఓ దుస్తుల దుకాణంలో పనిచేస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. నాగేంద్ర ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానేయాలని భార్య పలుమార్లు చెప్పినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. మద్యం మత్తులో తరచూ చనిపోతానని భార్యను బెదిరించేవాడు. ఎప్పటిలాగే సోమవారం భార్య దుస్తుల దుకాణానికి, పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. నాగేంద్ర ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. మధ్యాహ్నం భార్యకు ఫోన్ చేసి ఉరేసుకుని చనిపోతున్నానని బెదిరించాడు. ఆమె ఎందుకు అలా చేస్తున్నావని చెప్పి ఇంటికి బయలుదేరింది. అతను ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి చేరుకున్న సుప్రియ తలుపులు తెరిచే ప్రయత్నం చేసింది. రాకపోవడంతో స్థానికుల సహకారంతో తెరిచి లోనికి వెళ్లింది. భర్త కిందకు దించి 108కు సమాచారం అందించింది. అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నాగేంద్రప్ర పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాగేంద్ర ప్రసాద్ మృతదేహం

గ్యాస్ నింపి బ్లాక్‌మార్కెట్‌కు..

కొడవలూరు: గృహావసరాల సిలిండర్లలోని గ్యాస్‌ను చిన్న సిలిండర్లలో నింపి విక్రయిస్తుండగా పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు చేశారు. వారి కథనం మేరకు.. నార్తురాజుపాళెం రైటర్ తోపులోని కనకా మోహన్‌రావు అనే వ్యక్తి కొంత కాలంగా గృహావసరాల సిలిండర్లలోని గ్యాస్‌ను అక్రమంగా ఐదు కిలోల సిలిండర్లలో నింపి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు చేశారు. ఐదు గృహావసరాల, మూడు చిన్న సిలిండర్లను సీజ్ చేశారు. మోహన్‌రావుపై కేసు నమోదు చేయడం జరిగిందని విజిలెన్స్ విభాగం తహసీల్దార్ జీఎస్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఏఎస్‌ఓ జె.రవి, ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, ఆర్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■10th/Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, B.Lis, MA, M.Com, M.Sc, MCA, MBA, M.Lis, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT . ✆ 9030030125. [T-2353]

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/lateral entry. 9381287629 [T-2355]

REAL ESTATE

PLOT FOR SALE

■DTCP మరియు NUDA Approved Plots అమ్మకమునకు కలవు. ముత్తుకూరురోడ్డు, కాకుపల్లి దగ్గర. MR Properties. Contact: 7993516359, 9154264224. [NA-23830]

■హరనాథపురంలో వెంటనే HOUSE కట్టుకోవడానికి 25, 33 అంకణముల స్థలం అమ్మబడును. వివరములకు సంప్రదించండి: 99499 21853, 9390845455. [NA-23835]

■నెల్లూరు, ధనలక్ష్మీపురం, వెంకటాచలం, మనుబోలు హైవే, గూడూరు, ఆత్మకూరు, బుచ్చి బాంబే హైవే దగ్గర తక్కువధరకే ప్లాట్స్, నుడా ప్లాట్స్, బ్యాంకు లోన్, స్పాట్ Reg. 9652667237, 98490 02009. [NA-23794]

LAND FOR SALE

■కావలి నుంచి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజువారి చింతలపాలెం గ్రామంలోని మెయిన్ రోడ్ నందు ఉన్న 9 ఎకరాల మామిడితోట అమ్మబడును. సంప్రదించండి: 99005 27678. [NA-1253661]

SERVICES

స్కాలర్‌షిప్ ఇవ్వబడును

■చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్, పెళ్లకూరు, తిరుపతి జిల్లా వారు 2024-2025 విద్యా సంవత్సరంలో చదువుతున్న SPSR నెల్లూరు మరియు తిరుపతి జిల్లాలలోని అగ్రవర్ణ కులాల బీద&ప్రతిభావంతులైన విద్యార్థు లకు సహాయముగా లలితమ్మ విద్యా వికాస ఉపకార వేతనం కార్యక్రమము ద్వార 60 మంది విద్యార్థులకు రూ.25,000/- లెక్కన నగదు పురస్కారము చేయుదురు. దరఖాస్తు & పూర్తి వివరాలకు www.chaganamlbmtrust.org ను సందర్శించండి. దరఖాస్తు సమర్పించుటకు చివరి తేది: 30.10.2024, చాగణం గౌరీ శంకర్, మేనేజింగ్ ట్రస్టీ, 94403 24449, 7989311973. [C-800020]

WANTED

■Wanted married Female telecallers For Banking Process @ RTC, Nellore-Fixed Salary : 10,000 to 12500. No Targets. Contact: 79979 21150. [NA-776]

■Wanted Lady Doctor. Qualification : MBBS / BHMS / BAMS with 1-2 Years Experience in Gynaecology. Contact: S.Andal Bhaskar Near S2 Cinima Theatres, Pogathota, Nellore.Phone No.9908854316, 0861-2328914. [NA-2737]

■విజయవాడలో సంపన్నుల / పెద్దవారి ఇళ్ళ వద్దే ఉండి, పేషెంట్‌లని / Bed Ridden వారిని చూసుకొనుటకు అనుభవం గల కేర్ టేకర్స్ M/F నర్సులు, RMPలు కావలెను. ✆ 91608 35559, 98850 25559 [B-313]

■ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185499]

■నెల్లూరు బోసుబొమ్మ దగ్గర గల RKT పెట్రోలు బంకులో పని చేయుటకు రోజు మార్చి రోజు 24 గంటల డ్యూటీకి యువకులు మరియు నైట్ డ్యూటీకి యువకులు కావలెను. జీ:15,000. 9550189885. [NA-6662]

■బెంగుళూరుకు వంటవారు: వెజ్/నాన్‌వెజ్ మాస్టర్స్, అసిస్టెంట్లు, చేపల పులుసు చేయుటకు ఆడవారు, పార్సిల్ బాయ్స్, క్లీనింగ్‌కు భార్యాభర్తలు జీ: 15-35, రాజేంద్ర, నెల్లూరు. 81213 32070. [NA-6660]

■ప్రముఖ కేబుల్ సంస్థ నందు నెల్లూరు RN పేట, కావూరు, బుచ్చి, అరవిందనగర్ ఫీల్డ్ వర్క్ చేయుటకు వర్కర్స్ కావలెను. Male, Q:10th, ITI, ఇంటర్, Sal: 12000/- to 15000/- Ph: 9494829191, 9115456456 [G-782854]

■కష్టలెస్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు -40వేలు, ఫ్రీరూం+భోజనం. HYD. 9182260297 [HA-98871]

■నెల్లూరు టౌన్‌లో ఇన్నోవా కారు నడుపుటకు అనుభవం ఉన్న డ్రైవర్ వెంటనే కావలెను. సంప్ర : Ph: 7075332799 [HA-812]

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ: 18K Ph: 9160900024/ 9640400073 [HA-796285]

■ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు నెల్లూరు టౌన్, నాయుడుపేట పరిసరాలలో పని చేయుటకు వ్రాయడం / చదవగలిగిన సెక్యూరిటీ గార్డులు కావలెను. రూం/ భోజనం ఉచితం. మంచి జీతం. సెల్: 99089 54798, 91103 39912. [NA-6654]

■కందుకూరులోని ప్రముఖ వైద్యశాలలలో పనిచేయుటకు ANM, GNM నర్సింగ్ అర్హతతో అనుభవం గల నర్సింగ్ స్టాఫ్, రిసెప్షనిస్టులు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సం॥ ✆ 90324 46303 [O-793817]

■నెల్లూరు పరిసరప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీగార్డ్స్ / లేడీ గార్డ్స్ డ్యూటీ : 12గం॥ Qlf: 10th Pass / Fail. జీతం: 14,000/- ASO లు డ్యూటీ : 12గం॥ జీతం: 16,000/-. Qualification : ఇంటర్ ఆపై Age: 20-45. ఫ్రీ రూం & మెస్ సౌకర్యం కలదు. సంప్రదించండి: 9959444086, 94900 22205. [NA-23829]

ప్రకటన గోరంత స్పందన కొండంత

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.